www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 9 అక్టోబర్ 2023
5
వైఎస్ఆర్

## రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

**కడప :** వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ సమస్యల పరిష్కారం పై ఈనెల 10న 'ప్రత్యేక విద్యుత్ అదాలత్' నిర్వహించనున్నట్లు కడప విద్యుత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్.నరసింహ ప్రసాద్ తెలిపారు. ఆదివారం తన ఛాంబర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప విద్యుత్ భవన్ కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ సమస్యల పరిష్కారం పై ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కడప పట్టణం టౌన్–2 సబ్ డివిజన్ పరిధిలోని ఎన్జీవో కాలనీ, ఈస్ట్ సెక్షన్, నార్త్ సెక్షన్ విద్యుత్ కార్యాలయాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలపై వాతపూర్వక ఫిర్యాదు ద్వారా తమ విద్యుత్ సమస్యలను కన్జ్యూమర్ గ్రీవెన్స్ రెడ్రసల్ ఫోరం (సి.జి.ఆర్.ఎఫ్) వారి ఆధ్వర్యంలో పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకొని తమ విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

# ఆ(వే)ట షురూ!



### క్రికెట్ బెట్టింగ్‌పై తనిఖీలు ముమ్మరం

### కడప, ప్రొద్దుటూరుపై పోలీసుల నిఘా
### టివిలకు అతుక్కుపోయిన యువత

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

జిల్లాలో క్రికెట్ ఫీవర్ మొదలైంది. పొరుగు రాష్ట్రమైన తమిళ నాడులోని చెన్నయ్ పట్టణంలోని చెపాక్ స్టేడియంలో ఇండియా– ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆదివారం క్రికెట్ వన్డే మ్యాచ్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. సమాన బలాలు కలిగిన జట్ల మధ్య ఉత్కంఠ భరితమైన పోటీ నెలకొనడంతో యువత టెలివిజన్ సెట్లకు అతుక్కు పోయింది. ఇదిలాఉం డగా సమాన జట్ల మధ్య క్రికెట్ పోటీ నెలకొ నడంతో ఎనలేని ఉత్కంఠ నెలకొంది. ఈనేపథ్యంలో ఎవరు గెలు స్తారనే అంచనాలు రావడం సహజం. దీనికి అనుబంధంగా బంతికి బంతికి బెట్టింగులు కాయడం సర్వసాధారణంగా మారింది. దీన్ని సొమ్ము చేసుకునేందు కు బెట్టింగ్ గ్యాంగులు రంగంలోకి దిగడం షరామామూలే. ఈనేపథ్యంలో యువతలో సాంకేతికత పట్ల అవగా హన కలిగిన నేపథ్యంలో యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని ఆన్‌లైన్ బెట్టింగుల వలలో పడడం తెలిసిందే. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ అనే తేడా లేకుండా బెట్టింగుల జాడ్యం బారిన పడిన కారణంగా చాలా కుటుం బాలు వీధిన పడిన ఉదంతాలు అనేకం. గతంలో సాధారణ క్రికెట్ మ్యాచ్‌లకే జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున లక్షలాది రూపాయల్లో బెట్టింగులు నడిచిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా పోలీసులు తనిఖీలు చేయడంతో బెట్టింగు రా యుళ్లు పట్టుబడిన ఉదంతాలు అనేకం. ఇక వన్డే ప్రపంచకప్ అన గానే బెట్టింగ్‌రాయుళ్ల ఏస్థాయిలో పేట్రేగిపోతారో ఊహించుకోవా ల్సిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాం గం అప్రమత్తమైంది.కడప, ప్రొద్దుటూరు ప్రాంతాల్లోని పలు లాడ్జీలు, ఇతర ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేసింది. జిల్లాలో ఒకవైపు బెట్టింగ్ రాయుళ్లు, మరోవైపు పోలీసుల తనిఖీల మధ్య క్రికెట్ ఆ(వే)ట ఉత్కంఠను రేపుతోంది. ఇందులో ఎవరు ఓడుతారో, ఎవరు గెలుస్తారో కాలమే తేల్చనుంది.

### కడప, ప్రొద్దుటూరు, మైదుకూరులలో తనిఖీలు

**ప్రజాశక్తి - కడప అర్బన్ / ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)/ చాపాడు**

కడప నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జీలలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆదివారం ఎస్‌పి సిద్ధార్థ కౌశల్ పరిశీలించారు. లాడ్జిలోని రిజిస్టర్లను పరిశీలించి బస చేసిన వారి వివరాలు ఆరా తీయాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది కి పలు సూచనలు చేశారు. అనుమాస్పదంగా ఉండే వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని లాడ్జి నిర్వహకులకు తెలియచేయాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌పి వెంట కడప డిఎస్‌పి ఎస్.ఎం.డి షరీఫ్, ఎస్.బి ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి, వన్ టౌన్ సిఐ నాగరాజు, సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ లు, సిబ్బంది ఉన్నారు.

ప్రొద్దుటూరులో క్రికెట్ బెట్టింగ్ బెట్టింగ్ స్థావరాలపై పలీసులు దాడులు చేశారు. 30 మందికి పైగా క్రికెట్ బుకీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారందరిని మైదుకూరు, జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని శ్రీదేవి కళ్యాణ మండపంలో ఉంచారు. అక్కడి నుంచి ఎస్‌పి ఎదుట హాజరు

క్రికెట్ బుకీలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్

పరిచేందుకు వాహనాల్లో కడపకు తీసుకెళ్లారు. మరి కొందరు బుకీల కోసం పోలీసులు లాడ్జిల్లోనూ ఇతర స్థావరాలల్లో

మైదుకూరులో జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశాల మేరకు క్రికెట్ బెట్టింగ్, మట్కాల పై ఉక్కు పాదం మోపుతామని అర్బన్ సిఐ మస్తాన్ సూచించారు. ఆదివారం క్రికెట్ బెట్టింగ్, మట్కా ల పై తనిఖీలు నిర్వహించారు. మైదుకూరులో పలు లాడ్జీలు, అనుమానం ఉన్న ప్రదేశాలలో పోలీసుల దాడులు నిర్వహించారు. అనుమానం ఉన్న వ్యక్తులు లాడ్జిలకు వస్తే సమాచారం అందించాలన్న సిఐ నిర్వహకులకు సూచించారు.

# మహిళల ఆరోగ్యానికి పెద్దపీట

### నర్సింగ్ దరఖాస్తులపై నిశిత పరిశీలన
### 'సురక్ష'తో క్రానిక్ రోగులకు ఉపశమనం
### రీజినల్ డైరెక్టర్ కె.వి.ఎన్.ఎస్. అనిల్‌కుమార్

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

ముఖా ముఖి..

**మహిళల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. గర్భిణులు, బాలింతలు, మధ్య వయస్కుల్లో రక్తహీనత కలిగిన మహి ళలకు అత్యాధునిక వైద్యసేవలు అందిస్తున్నాం. రాష్ట్రప్రభుత్వం ఇటీ వల ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి విప్ల వాత్మక పథకాలతో ప్రజారోగ్యంలో విప్లవాత్మక పాత్ర పోషిస్తోంది. దీంతో ప్రజల ఆరోగ్యం పట్ల అవగాహన స్థాయిని పెంచుతోంది. ఇందులోభాగంగానే ఫ్యామిలీ డాక్టర్ సేవల్లో మండలానికి రెండు పిహెచ్‌సిలు, వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్స్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్య క్రమంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఉపశమ నం లభించనుంది. భవిష్యత్ రిక్రూట్‌మెంట్‌ల్లో ఎంపికైన దరఖాస్తు దారుల సర్టిఫికెట్లను యూనివర్శిటీ ఉన్నతాధికారుల పరిశీలన అనం తరం పారదర్శకంగా నియామకాలు చేపడతామని పేర్కొంటున్న రీజి నల్ డైరెక్టర్, స్త్రీ సంక్షేమశాఖ అదనపు డైరెక్టర్ కె.వి.ఎన్.ఎస్ అనిల్ కుమార్‌తో ముఖాముఖి...**

**మహిళా ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలేమిటి?**

రాష్ట్రంలో తొమ్మిది లక్షల మంది గర్భిణులు ఉన్నారు. గర్భం దాల్చిన దగ్గర నుంచి బాలింత దశ వరకు వైద్య సహాయకుల నిరంతర పర్యవేక్షణలో 360 మందులు అందజేయడం జరుగుతో ంది. గర్భిణి దశలో 180, బాలింత దశలో 180 మందులను పం పిణీ చేస్తున్నాం. ఫలితంగా మహిళలు బాలింత జబ్బుల బారిన పడ కుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

**అనీమియా వైద్యసేవలు వివరాలు తెలపండి?**

రాష్ట్రంలో అనీమియా బారిన పడిన మహిళలపై ప్రత్యేక దృష్టి సారించడమైంది. విఫ్స్ ప్రోగ్రామ్ కింద ఐదేళ్ల బాలికల దగ్గర నుంచి మధ్య వయస్కుల వరకు మందుల దగ్గర నుంచి ఇన్‌జెక్షన్ దశ వరకు వివిధ రకాల వైద్య సేవలు అందించడం జరుగుతోంది. ఇందులో ప్రథమ దశలో ల్యాబెట్ల స్థాయిలో అధికగమించే ప్రయ త్నం చేస్తున్నాం. గర్భిణి దశలో రక్తహీనత ఎదురైతే కాన్పు అనం తరం రూ.3800 విలువతో కూడిన సింగపూర్, మలేషియా దేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఆధునిక ఇంజెక్షన్ల సహాయంతో సత్వ రమే రక్తంలో హీమోగ్లోబిన్ పెరుగుదలకు చర్యలు తీసుకుంటు న్నాం.

**డయాగ్నోస్టిక్ ఫీజుల క్రమబద్ధీకరణపై స్పందించండి?**

డయాగ్నోస్టిక్ ఫీజుల క్రమబద్ధీకరణ విషయంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ విధానాన్ని ఎంపిక చేయడంపై దృష్టి సారించాం. టెస్టింగ్ రియాక్టర్స్ విషయంలో స్పష్టమైన అవగాహనకు వచ్చిన అనంతరం అమలు చేస్తాం. ఇందులోభాగంగా విజయవాడలో డ యాగ్నోస్టిక్ సెంటర్ భవనాన్ని ఏర్పాటు చేశాం. విజయవాడలోని పై లెట్ ప్రాజెక్టు విజయవంతమైన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తాం.

**జగనన్న సురక్ష ప్రయోజనాల్ని వివరించండి?**

జగనన్న సురక్ష పథకంలో క్రానిక్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవకాశం ఉంది. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి జీవితాల్ని అతికష్టంగా లాగుకొస్తున్న వారికి ఎంతో ఉప శమనం లభిస్తుంది. ప్రతి పిహెచ్‌సి పరిధిలో 172 రకాల మందు లను అందుబాటులో ఉంచుతాం. గుండె సంబంధిత వ్యాధుల మం దులను సైతం అవసరమైన మేరకు అందుబాటులో ఉంచే ప్రయత్నం జరుగుతోంది.

**ఫ్యామిలీహెల్త్ కాన్సెప్ట్‌పై మీ స్పందనేమిటి?**

ఫ్యామిలీ హెల్త్ కాన్సెప్ట్ ఉద్దేశం ఎంతో మంచిది. 30 నిమిషాల వ్యవధిలో ఆరోగ్య సేవలు అందుకునేందుకు అవకాశం ఏర్పడింది. డయాబెటిస్, హైపర్‌టెన్షన్ వంటి పలు రకాల వ్యాధులకు సంబంధించిన ప్రిస్కిప్షన్‌కు ఆర్నెళ్లపాటు ఆమోదనీయత ఉంటుంది. వీటితోపాటు అసాంక్రమిత వ్యాధులను సకాలంలో అదుపులో ఉంచుకునేందుకు అవకాశం ఉంది.

**వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్స్ పని తీరు ఎలా ఉంది?**

రాష్ట్రవ్యాప్తంగా 10 వేల వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్స్, 542 యుహెచ్‌సిలున్నాయి.విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో కుటుంబ హెల్త్ డేటాను భద్రపరచడం జరుగుతుంది. ఫలితంగా వారికి భవిష్యత్‌లో ఎదురయ్యే వ్యాధులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి దోహదం చేస్తుంది.

**నకిలీ సర్టిఫికెట్ల బెడద నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి?**

జోన్–4లో నర్సింగ్ నియామకాల్లో నకిలీ సర్టిఫికెట్ల బెడద నివారణపై సీరియస్‌గా దృష్టి సారించాం. దరఖాస్తుల స్క్రీనింగ్ అనంతరం నిర్వహించనున్న కౌన్సిలింగ్‌లో అర్హత సాధించిన అభ్యర్థి సర్టిఫికెట్లను హెల్త్ యూనివర్శిటీ ఉన్నతాధికారుల సహకారం తీసుకుంటాం. యూనివర్శిటీ అధికారులు సర్టిపై చేసిన అనంతరం నియామకాలు చేపడతాం. దీంతో నియామకాల్లో పారదర్శకతను తీసుకొస్తాం.

**స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుంది?**

సెప్టెంబర్ మూడవ వారంలో 94 స్టాఫ్‌నర్స్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈమేరకు ఈనెల ఐదు నాటికి సుమారు 9,800 దరఖాస్తులను స్వీకరించడమైంది. ప్రస్తుతం దరఖాస్తుల స్క్రూటి దశ నడుస్తోంది. అక్టోబర్ చివరి నాటికి స్టాఫ్‌నర్స్ పోస్టులను భర్తీ చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం.

**జోన్-4 పరిధిలోని విభాగాలు, ఉద్యోగులు సంఖ్య ఎంత?**

జోన్–4 పరిధిలో కడప, అన్నమయ్య, అనంతపురం, సత్య సాయి, కర్నూలు, నంద్యాల, తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలో 3, 800 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇందులో ఎంపిహెచ్ఇఒ, ఎంపి హెచ్ఎస్, హెచ్ఇసి, ఎంఎల్‌హెచ్‌పి, సీనియర్, జూనియర్ అసిస్టె ంట్లు, తాజాగా ఫార్మసిస్టులను కూడా కలపడంతో విస్తృతి పెరిగింది. వీరందరి సర్వీసులు, రిక్రూట్‌మెంట్లు, బదిలీలు, వైద్య ఆరోగ్యానికి సంబంధిత స్కీముల అమలు తీరును పరిశీలన చేయాల్సి ఉంటుంది.

# సమరశీల పోరాటాలు యుటిఎఫ్‌కే సాధ్యం

### -రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

**ప్రజాశక్తి -పోరుమామిళ్ల**

ప్రభుత్వం ప్రాథమిక విద్యకు పాతర వేస్తే ఉద్యమాలు ఉధృతం చేస్తామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా పేర్కొన్నారు. ఆదివారం యుటిఎఫ్ స్వర్ణోత్సవాలలో భాగంగా ప్రాంతీయ మహాసభలను పట్టణంలోని యుటిఎఫ్ మండల అధ్యక్షులు నాయబ్ రసూల్ అధ్యక్షతన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పడి 49 వసంతాలు పూర్తయిందని 50వ సంవత్సరంలోకి అడుగుడిన సందర్భంగా గత కాలంలో పనిచేసిన ఉపాధ్యాయ ఉద్యమ నాయకుల పోరాట ఫలితాలను, త్యాగాలను గుర్తు చేశారు. భవిష్యత్తులో 50 సంవత్సరాలకు సరిపడా ఉద్యమ స్ఫూర్తిని అందరిలో రగిలించడానికి సమావేశాలు తోడ్పడాయని తెలిపారు. విద్యారంగా ఉపాధ్యాయ సమస్యల పోరాటంలో అలుపెరుగని రాజీలేని పోరాటాల ద్వారా ఎన్నో విజయాలు యుటిఎఫ్ సాధించిందన్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాళెం మహేష్ బాబు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం పేరుతో ప్రాథమిక పాఠశాలల విలీనం వలన ప్రభుత్వ ప్రాథమిక విద్య పూర్తిగా దెబ్బతిని పాఠశాలలు మూతపడే స్థితికి వస్తున్నాయన్నారు. దీనిని ఎదుర్కోవడానికి భవిష్యత్తులో ఒక ప్రణాళిక బద్ధమైన ఉద్యమ కార్యాచరణ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు జెడ్ జయరామయ్య, కుర్రా చెన్నయ్య ఏజాస్ అహ్మద్ ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ నాయకులు కృష్ణయ్య, ఈశ్వరరావు భాస్కర్ రెడ్డి, నూనె శ్రీనివాసులు, రమణమూర్తి, సత్యనారాయణ, చెన్న కృష్ణయ్య గంగయ్య రాఘవ, కేజె ప్రవీణ్, వెంకటేశ్వర్లు, పీవీ చంద్రశేఖర్, కిరణ్ కుమార్ ప్రధానోపాధ్యాయురాలు కే సుబ్బమ్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ భైరవ ప్రసాద్ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

**జిపిఎస్ అమలు దుర్మార్గం**

**చాపాడు** : రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేసిందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పేర్కొన్నారు. ఆదివారం మైదుకూరు ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని మరిచి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయకపోను ప్రస్తుతం ఉన్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు గ్యారెంటీ లేని జిపిఎస్ విధానాన్ని అమలుపరిచేందుకు శాసన సభలో బిల్లు ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి తాను చెప్పినట్లు పాత పెన్షన్ ఇవ్వాలి తప్ప మరో దుర్మార్గపూరితమైన పెన్షన్ విధానాన్ని ప్రవేశపెడితే ఒప్పుకోమని చెప్పారు. ప్రతి ఉద్యోగి 30 సంవత్సరాలకు పైగా ప్రభుత్వ సర్వీసులో పనిచేస్తారని, అలాంటి ఉద్యోగి విరమణ పొందిన అనంతరం గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి అవకాశం ఉండే విధంగా చూడవలసిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంటుందని తెలిపారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రికి కనువిప్పు కలిగి వచ్చే ఎన్నికలలోపు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి తీరాలని, అలా చేయని పక్షంలో ఉద్యోగ ఉపాధ్యాయులు ఏకమై ఉద్యమ కార్యాచరణ చేపట్టి ప్రభుత్వ దమన నీతిని ఎండ కడతామని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహమ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ నాయకులు కిరణ్ కుమార్ పాల్గొన్నారు




మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

### రెడ్డిగా పుట్టడం నేను చేసిన నేరమా? : మలిరెడ్డి

**ప్రజాశక్తి - కడప**

కడపలో రెడ్డిగా పుట్టడం నేను చేసిన పాపమా?, వై.ఎస్. కుటుంబాన్ని పల్లకీ మోయడం నేను చేసిన నేరమా? అని వైఎస్ జగన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు, వైసిపి సీనియర్ నాయకులు మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆ పార్టీ నాయకులను ప్రశ్నించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కడప నగరంలో వైఎస్ కుటుంబానికి, జగనన్నకు దాదాపు 30 సంవత్సరాల సేవకుడిగా, జగనన్నకు వీరాభిమానిగా, 30 సంవత్సరాలుగా జగనన్ననే జీవితము అనుకొని సర్వస్వం పోగొట్టుకున్న మాట వాస్తవం అన్నారు. కానీ తనను కడప వైసిపి నాయకులు రాజకీయంగా, ఆర్థికంగా,మానసికంగా అణచివేతకు గురి చేశారు అన్నారు. అయినా నేటికీ వైసిపి కోసం, వైఎస్ కుటుంబం కోసం ఒక నాయకునిగా, సామాన్య కార్యకర్తగా నా ఊపిరి ఉన్నంతవరకు వైఎస్ కుటుంబం కోసం కడదాకా పనిచేస్తూనే ఉంటా అని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్ల కాలంలో ఏ ఒక్క లబ్ధి నేను పొందలేదని, చివరికి జగనన్న ఇచ్చిన ఇంటి స్థలం కూడా కడప తొమ్మిదో డివిజన్ లో తొలగించారు అన్నారు. తనకు పొడిచింది కడప వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులే అని అన్నారు.

### ఏంజెల్స్ లేడీస్ హాస్టల్ ప్రారంభం

**ప్రజాశక్తి- కడప అర్బన్**

నగరంలోని రమేష్ థియేటర్ ఎదురుగా ఉన్న రాధాకృష్ణ నగర్‌లో ఏంజెల్స్ లేడీస్ హాస్టల్‌ను ఆదివారం గౌస్ కమ్యూనికేషన్స్ అధినేత గౌస్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసీ సౌకర్యంతో పాటు ప్యూరిఫైడ్ కూల్ డ్రింకింగ్ వాటర్, స్నానాలకు వేడి నీళ్ల సౌకర్యం కూడా ఉందన్నారు. రుచికరమైన వెజ్, నాన్ వెజ్ భోజనాలు, 24 గంటలు వైఫై తో పాటు, సిసి కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎల్ఈడి టీవీ, లాకర్, వాషింగ్ మిషన్ వంటి అధునాతనమైన సౌకర్యాలు ఉన్నాయన్నారు. 2,3,5 షేరింగ్, ఒకరోజు స్టే , సదుపాయం కూడా ఉందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చాంద్ బాషా, కమల్‌బాషా, అయేషా, సఫ్రీన్, ఎస్ ఎండి సోహెల్, ఆర్షియా సాకీద్, సమద్,సుధా,జయదేవ్ రెడ్డి, కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### భారీ స్కోరు సాధించిన చిత్తూరు జట్టు

**కడప :** జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్ – 23 మెన్ మల్టీ డే క్రికెట్ టోర్నీలో భాగంగా కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్ లో చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 550 పరుగుల భారీ స్కోరు చేసింది. 5 వికెట్ల నష్టానికి 485 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 99.4 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 550 పరుగుల వద్ద డిక్లేర్ ప్రకటించింది. ఆ జట్టులోని జి ఆశిష్ రెడ్డి బ్యాటింగ్ లో అద్భుతంగా రాణించాడు. 196 బంతులను ఎదుర్కొని 28 బౌండరీలు, 6 సిక్సర్ల సహాయంతో 209 పరుగులు (డబల్ సెంచరీ) చేశాడు. కర్నూలు జట్టులోని పి. సాత్విక్ బౌలింగ్లో అద్భుతంగా రానించి 5 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 60.4 ఓవర్లలో 226 పరుగులకే ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని ఎం మహేంద్ర యాదవ్ బ్యాటింగ్లో అద్భుతంగా రాణించి 105 పరుగులు (సెంచరీ) చేశాడు. చిత్తూరు జట్టులోని మల్లేషన్ బౌలింగ్లో అద్భుతంగా రానించి 5 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ దీపన్ సాయినాథ్ 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 9.0 ఓవర్లలో 2 వికెట్లను స్థానిక 41 పరుగులు చేసింది.

**171 పరుగులకే కుప్పకూలిన కడప జట్టు....** కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న వేరొక మ్యాచ్‌లో కడప జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 171 పరుగులకే ఆల్ అవుట్ అయింది. 12.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 51 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 46.2 ఓవర్లలో 171 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని టి. వంశీకృష్ణ 52 పరుగులు చేశాడు.

### ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు

**కడప అర్బన్ :** నగరంలోని బిల్టప్ దగ్గర ఉన్న అజ్మత్ కల్యాణ మండపంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సిరతున్నబి (సల్లెల్లాహు అలైహి వసల్లం) గురించి క్విజ్ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ముక్తార్ అహ్మద్ మాట్లాడుతూ ఈ పోటీలను వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో మద్రసా, స్కూల్, కళాశాల విద్యార్థులకు పోటీ పరీక్షలను నిర్వహించామన్నారు. సీనియర్ గ్రూప్ (ఇంటర్ నుంచి డిగ్రీ) వరకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు, మూడవ బహుమతి రూ.3 వేలు, జూనియర్ గ్రూప్ 6 వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొదటి బహుమతి బహుమతి రూ.5 వేలు, రెండవ బహుమతి రూ.3 వేలు మూడవ బహుమతి రూ.2 వేలు ఇస్తామని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న బండారు సూర్యనారాయణ

### 'సంఘం బలోపేతానికి ఐక్యంగా పనిచేద్దాం'

**ప్రజాశక్తి-కడప**

జిల్లాలో రాష్ట్రంలో తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం బలోపేదానికి అందరం కలిసికట్టుగా, ఐక్యంగా కృషి చేద్దాం అని తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం కడప నగరం మృత్యుంజయకుంటలోని సంఘం జిల్లా కార్యాలయంలో బండారు సూర్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో రాష్ట్ర యువజన సంఘానికి కడప జిల్లా నుండి ఐదుగురి పేర్లను ఎంపిక చేసి ఆమోదం కోసం రాష్ట్ర సంఘానికి పంపించినట్లు తెలిపారు. రాష్ట్ర మహిళా సంఘానికి కడప జిల్లా నుంచి నలుగురి పేర్లను ఎంపిక చేసి ఆమోదం కోసం రాష్ట్ర సంఘానికి పంపించామన్నారు. రాష్ట్ర కార్యవర్గంలోకి కడప జిల్లా నుంచి ముగ్గరి పేర్లను ఎంపిక చేసి ఆమోదం కోసం రాష్ట్ర సంఘానికి పంపినట్లు చెప్పారు. కడప జిల్లాలో కొన్ని నియోజకవర్గ, మండల కమిటీలను కూడా త్వరలో ఏర్పాటు చేస్తామని అన్నారు. సమావేశంలో తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్యా సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చౌడం శ్రీనివాసులు, తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహారావు, కోశాధికారి టేకూరి సుదర్శన్, గౌరవాధ్యక్షులు పల్లా బాల చౌడన్న, ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, బొలిశెట్టి వెంకటస్వామి, ఉపాధ్యక్షులు దొండ్ల వెంకటరమణ, బండారు శ్రీనివాసులు, పులివెందుల నుంచి అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, జమ్మలమడుగు, పొద్దుటూరు సంఘం కార్యవర్గ సభ్యులు, చెన్నూరు మండలం అధ్యక్షులు మడక వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

### రాజకీయ అవకాశాలు కల్పించాలి

**- దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ బాదుల్లా**

**ప్రజాశక్తి-కడప సిటీ**

దూదేకులను రాజకీయంగా నిర్లక్ష్యం చేస్తే రానున్న ఎన్నికల్లో నిలదీస్తామని నూర్ బాషా దూదేకుల సంక్షేమం సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా అన్నారు ఆదివారం స్థానిక కార్యాల యంలో జిల్లా అధ్యక్షులు పగిడాలా పెద్దన్న అధ్యక్షతన సుంకేసుల బాదుల్లా విలేకర్ల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలో 2 లక్షలు జనాభా ఉన్నప్పటికీ గుర్తింపు కల్గిన పదవులు ఏ పార్టీలలో లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు ఓటర్లుగా చూస్తున్నారే తప్ప రాజకీయ పదవుల్లోఅవకాశం కల్పించడం లేదని వాపోయారు. ఎన్నికలల్లో హామీలు ఇచ్చి తర్వాత మోసం చేస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో నూర్‌బాష్ ప్రజలను చైతన్యపరిచే విధంగా 'దూదేకుల సంఘం పిలుస్తోంది రా' అనే కార్యక్రమాన్ని త్వరలో కడప నగరం నుంచి అన్ని డివిజన్లు తిరిగి తరువాత జిల్లా అంతటా పూర్తి చేసుకొని ఒక మహాసభ నిర్వహిస్తామని తెలిపారు కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగూరు కుళాయిప్ప ప్రధాన కార్యదర్శి ఆర్ సిద్దయ్య అన్నమయ్య జిల్లా సెక్రటరీ మహ్మద్ షబ్బీర్ పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న సుంకేసుల బాదుల్లా

పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

### విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు

**ప్రజాశక్తి-కడప అర్బన్**

దీన్ దయాళ్ స్పర్శ్ యోజన స్కాలర్షిప్ స్కీం –2023లో భాగంగా కడప పోస్టల్ డివిజన్‌లో ఆదివారం కడప ప్రధాన తపాల కార్యాలయనికి దగ్గర ఉన్న బాలిక ఉన్నత పాఠశాలలో 150 మంది విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు విజయభాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ పోటీలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ మొదటి స్థాయి పోటీలు నిర్వహించామని చెప్పారు. ఫిలాటెలీ అనేది పోస్టల్ స్టాంపుల సేకరణ, అధ్యయనమని తెలిపారు. ఇది స్టాంపులు, ఇతర సంబంధిత ఫిలాటెలిక్ ఉత్పత్తులపై సేకరణ, పరిశోధన కార్యకలాపాలను కలిగి ఉంటుందని చెప్పారు. స్టాంపుల సేకరణ అభిరుచి చాలా విద్యాపరమైన ప్రయోజనాలను కలిగి ఉందని పేర్కొన్నారు. స్టాంపుల సేకరణ జీవితంలోని ఒత్తిడిని ఎదుర్కొనే ఒక విశ్రాంతి కార్యకలాపంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి. రామశంకర్, భాస్కర్ రెడ్డి , అహ్మద్ హుస్సేన్, అమర్నాథ్, సుబ్బారాయుడు, సునీతా దేవి, సునీతా, శివగోపాలకృష్ణ, పి ఎల్ ఐ డెవలప్ మెంట్ ఆఫీసర్ మునాఫ్, తపాలా సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీలు వృథా

**ప్రజాశక్తి - కడప అర్బన్**

మాజీ సైనికుల సంక్షేమంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సబ్సిడీలు వృథా అవుతున్నాయని మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సిఎస్ఐ హైస్కూల్‌లో మాజీ కెప్టెన్లు జానకి రామ్, మనోహర్, ఎస్.ఎస్. రాజు, చంద్రమోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, బి.వి. గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ సైనికుల సమావేశం నిర్వహించారు. పెన్షన్లు, వారి సంక్షేమ కార్యాలయాలలోని సౌలభ్యాలు, వాటి పనితీరు పై చర్చించారు. సౌలభ్యాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో సైనికులు, సైనిక వితంతువులు రాష్ట్ర ప్రభుత్వాన్ని తమకు సైతం ఇంటి స్థలాలను కేటాయించేలా, ఆన్లైన్లో ప్రోగ్రామ్ సెట్టింగ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఇళ్ల స్థలాల కోసం రాష్ట్ర సైనిక డైరెక్టరేట్ రాష్ట్రవ్యాప్తంగా అందరి వివరాలు సేకరించిందని, దీనిపై ఉలుకు, పలుకు లేదని చెప్పారు. తమ సమస్యలపై సైనిక డైరెక్టరేట్ కు విన్నవించుకున్న రక్షణ శాఖ సైతం స్పందించిన రాష్ట్ర సైనిక డైరెక్టరేట్ కార్యాలయము స్పందించకపోవడం విచారకరమని తెలిపారు. మానవతా దృక్పథంతో తమ సమస్యలపై స్పందించాలంటూ ఈ మేరకు మాజీ సైనికులు తమ విజ్ఞప్తిని అధికారులకు అందించాలని నిర్ణయించారు.

### 16 నుంచి సెలవులు ప్రకటించండి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

యోగివేమన విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలలకు దసరా సెలవులు ఈనెల 16 నుంచి 24 వరకు ప్రకటించాలని గవర్నమెంట్ కాలేజ్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (జిసిజిటిఎ) జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్. ఎల్. నాగభూషణం రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బీదం విజయ్ కుమార్ కోరారు. యోగి వేమన విశ్వవిద్యాలయం కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య కె.రఘుబాబు కలసి కోరారు. ఈ మేరకు వారు వినతి పత్రాన్ని సమర్పించారు. డిగ్రీ కళాశాలకు ఈనెల 20 నుంచి 25 వరకు విశ్వవిద్యాలయం సెలవులు ప్రకటించిందని దాన్ని సవరిస్తూ 16 వ తేదీ నుంచి ఇవ్వాలని కోరారు. దసరా ఉత్సవాలను జరుపుకోవడానికి అధ్యాపకులు తమ తమ ప్రాంతాలకు వెళ్లేందుకు వీలుగా సెలవులు పొడిగించాలని కోరారు.

## రాజకీయాల్లో దూదేకులకు ప్రాధాన్యత కల్పించాలి

**- కోనాపురం ఉప సర్పంచ్ రాయపాటి దస్తగిరి**

**ప్రజాశక్తి - ముద్దనూరు**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77ఏళ్ళు గడచినా రాజకీయాల్లో దూదేకుల కులస్తులకు అన్యాయం జరుగుతోందని కడప జిల్లా దూదేకుల సంఘం ప్రధాన కార్యదర్శి, కోనాపురం ఉప సర్పంచ్ రాయపాటి దస్తగిరి అన్నారు. రాజకీయాల్లో దూదేకులకు ప్రాధాన్యత ఇవ్వకుండా అణగ దొక్కు తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, టిడిపి, వైసిపి కేవలం ఓట్ల కోసం వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్ని తరగతుల కులాలకు అవకాశం కల్పిస్తామని దూదేకులకు మాత్రం ఒక్క అవకాశం కూడా ఇవ్వకుండా తీరని అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, ఒసి, మైనారిటీలకు అవకాశం కల్పించి దూదేకులకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో దూదేకుల కులస్తులు 30 లక్షల మంది ఉన్నారన్నారు. కనీసం కుల వృత్తి పరంగా (పరుపులు కుట్టే వృత్తి) కూడా గుర్తించలేదని ఆవేదన చెందారు. కేవలం 2,3 శాతం ఉన్న వారికి రాజకీయాల్లో అవకాశం కల్పించి పదవులు కట్టబెట్టారని తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవుల్లో దూదేకులకు ఒక్క అవకాశం కూడా ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆవేదన చెందారు. రానున్న ఎన్నికల్లో దూదేకులకు అవకాశం కల్పించాలన్నారు. ఏ పార్టీ అయినా రానున్న ఎన్నికల్లో ప్రాధాన్యత ఇవ్వకుంటే ఓటుతో తగిన బుద్ధి చెబుతామని దస్తగిరి హెచ్చరించారు.

## అన్నదానానికి పలువురు విరాళం

**ప్రజాశక్తి - చక్రాయపేట**

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ స్వామి నిత్య అన్నదానం చేయుటకు పలువురు విరాళాలు అందజేశారు. కడప నగరం ఇందిరానగర్ వాస్తవ్యులు గజ్జల జీవన్‌రెడ్డి, ధర్మపత్ని ఉషాభారతి రూ.50,116 విరాళం ఇచ్చారని ఆలయ ఎసి అలవలపాటి ముకుందారెడ్డి, చైర్మన్ పినుబోలు రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. విరాళాల కౌం టర్ ద్వారా రూ.38,000 వచ్చినట్లు తెలిపారు. విరాళాలు ఇచ్చిన వారికి అంజన్న సన్నిధిలో వారి కుటుంబ సభ్యుల పేరుతో ప్రధాన అర్చకుడు కేసరి స్వామి, రాజా స్వామి ప్రత్యేక పూజలు చేస, ఆంజనేయ స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

అంజన్న చిత్రపటాన్ని అందజేస్తున్న ఎసి

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**ప్రజాశక్తి - చాపాడు**

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని నంద్యాల రోడ్డులోని విఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్ఎల్ఆర్ హాస్పిటల్ వైద్యులు రామఅనిల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వందలాది మంది వివిధ రకాల పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారు. ఈ సందర్భంగా వైద్యులు రామ అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ఎల్ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రతివారం మైదుకూరు నియోజకవర్గ పరిధిలో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్త పరీక్షలతోపాటు ఇసిజి ఇతర పరీక్షలను ఉచితంగా చేయిస్తున్నామన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి కళాశాల కరస్పాండెంట్ ఎస్ వెంకటరాముడు, ప్రముఖ న్యాయవాది కె శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపల్ బి తిరుమలేష్, సామాజిక కార్యకర్త చెన్నకేశవ, రాము సహకరించారు. కార్యక్రమంలో కర్నూల్ మెడికవర్ సిబ్బంది బివి కొండారెడ్డి, ఎస్ఎల్ఆర్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రామ అనిల్‌కుమార్‌రెడ్డి

## దసరా ఉత్సవ ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ

**ప్రజాశక్తి - చాపాడు**

మైదుకూరు అమ్మవారిశాలలో ఆదివారం దసరా మహోత్సవ ఆహ్వాన పత్రికలను ఆర్యవైశ్య సభ అధ్యక్షులు సూరిశెట్టి వెంకటప్రసాద్ గుప్తా ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాలను ఈ ఏడాది వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు ఈనెల 15న ఉత్సవాలు ప్రారంభమై 24వ తేదీ వసంతోత్సవంతో ముగుస్తాయన్నారు. ప్రతిరోజు అమ్మవారి ప్రత్యేక అలంకారాలతోపాటు పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. దసరా సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సభ అధ్యక్షులు

## అసాంఘిక శక్తులపై దాడులు అభినందనీయం

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు( పుట్టపర్తి సర్కిల్)**

ప్రొద్దుటూరులో అసాంఘిక శక్తులపై ఎస్‌పి ఆధ్వర్యంలో దాడులు చేయడాన్ని అభినందిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక నెహ్రూరోడ్డు లోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌పి వచ్చిన కొద్ది రోజుల్లోనే జిల్లాను అవగాహన చేసుకుని ఎక్కడ అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని గుర్తించి స్థానిక పోలీసులకు తెలియకుండా స్పెషల్ పోలీసులను పంపించి పొద్దుటూరులో క్రికెట్ బుకీలను అరెస్ట్ చేసి కడపకు తరలించడం హర్షణీయమన్నారు. ఇలాంటి దాడులు ఇంకా కొనసాగించాలన్నారు. మరిన్ని అసాంఘిక కార్యక్రమాలు ప్రొద్దుటూరులో జరుగుతున్నాయని, వాటిపై దృష్టి సారించాలని ఆయన కోరారు. దష్టి సారించాలని కోరారు. నాలుగేళ్లగా ప్రొద్దుటూరులో క్రికెట్ బెట్టింగ్, పేకాట విచ్చలవిడిగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి

## మూల మల్లికార్జునరెడ్డికి ఘన సత్కారం

**ప్రజాశక్తి - ఖాజీపేట**

యోగి వేమన విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులుగా తుడమలదిన్నె గ్రామానికి చెందిన మూల మల్లికార్జునరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామస్తులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మూల మల్లికార్జునరెడ్డి మాట్లా డుతూ యోగి వేమన విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మైదుకూరు రూరల్ సిఐ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి, ఏపీఐఐసీ రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబూబకర్ సిద్దిక్, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, అధికార భాష సంఘం రాష్ట్ర సభ్యులు వెంకటయ్య, గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

# టమోటా ధరలు పతనం

## - పంటను పొలాల్లోనే వదిలేసిన రైతులు

రోడ్డుపై పారేసిన టమోటా పండ్లు

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

టమోటా ధరలు భారీగా పడిపోవడంతో రైతులకు కన్నీళ్లు మిగిలాయి. నెలరోజుల కిందట వందల్లో పలికిన టమాటా ధరలు ఇప్పుడు దారుణంగా పడిపోయాయి. రూ.5 కూడా కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. టమాటాకు ధరలు లేక రైతులు రోడ్ల మీద పారబోస్తున్నారు. టమోటా ధరలు జూలై, ఆగస్టు నెలలో కిలో కూ.150 వరకు పెరిగాయి. ఈ నేపథ్యంలో రైతులు టమోటా పంట సాగు చేయడంతో విస్తీర్ణం బాగా పెరిగింది. పులివెందుల నియోజకవర్గంలో లింగాల, పులివెందుల, వేముల మండలాలలో దాదాపు 1020 ఎకరాల్లో పంట సాగు చేశారు. ధర బాగా తగ్గడంతో కనీసం ఖర్చులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు అన్ని మార్కెట్‌లలో ఇదే పరిస్థితి. కిలో టమాటా పులివెందుల మార్కెట్‌లో రూ.3 పలుకుతోంది. మదనపల్లి మార్కెట్‌లోనూ ధరలు దారుణంగా పడిపోయాయి. ధరలు భారీగా తగ్గిపోయాయని, దీని వల్ల కోత, రవాణా ఖర్చులు సైతం రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఏపీలోని అన్ని మార్కెట్లలో ఇదే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో టమాటా పంట చేతికందడంతో రేటు దారుణంగా పడిపోయింది. అంత తక్కువ ధరకు గిట్టుబాటు కాదని రైతులు మార్కెట్‌కు తెచ్చిన టమోటాలను అమ్మకోలేక, తిరిగి తీసుకెళ్లలేక కింద పడవేసి వెళ్తున్నారు. ధరల స్థిరీకరణ తీసుకువచ్చామన్న ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయకపోవడంతోనే ధరలు పెరగడం, తగ్గడం జరుగుతోందని తెలిపారు. దీంతో రైతులు ఎప్పుడు పంట వేయాలో తెలియక భారీగా నష్టపోవాల్సి వస్తుంది. టమోటా ధరలు నిలకడగా ఉండేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**ప్రభుత్వమే పంటను కొనాలి :** రైతులు పండించిన టమోటా పంట ధర తగ్గినప్పుడు ప్రభుత్వమే నేరుగా కొనాలని లింగాల మండలం ఇప్పట్ల గ్రామరైతు సారెడ్డి రామ్మోహన్‌రెడ్డి సూచిస్తున్నారు.

టమోటా పండ్లను పొలాల్లోని వదిలేసిన రైతు

## పేద, మధ్య తరగతి వారికి సంక్షేమ పథకాలు

### నేడు, రేపు తపాలాదినోత్సవం : పోస్ట్‌మాస్టర్ జె.సుబ్బరాయుడు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

పేద, మధ్య తరగతి కుటుంబాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, వారి సంక్షేమం కోసం తపాలా శాఖ పలు పథకాలను ప్రవేశ పెడుతోందని పోస్ట్‌మాస్టర్ జె.సుబ్బ రాయుడు తెలిపారు. సోమవారం అంతర్జాతీయ తపాలా దినోత్సవం, మంగళవారం జాతీయ తపాల దినోత్సవాన్ని పురస్కరించుకుని పోస్ట్ మాస్టర్ 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఆనాటి బ్రిటీష్ హయాంలో 1854లో ఇండియన్ పోస్ట్ ఆఫీస్ ప్రారంభించబడిందన్నారు. 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి ఏడాది అక్టోబర్ 9,10న తపాల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. మంగళవారం నుండి జాతీయ తపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 10న మంగళవారం బ్యాంకింగ్ డే నిర్వహిస్తామని, అన్ని బ్యాంక్ సేవలు తపాల శాఖ ద్వారా కూడ ప్రజలకు అందజేస్తామన్నారు. ఈనెల 12న గురువారం పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ డే నిర్వహి స్తామన్నారు. ఈ పథకం ద్వారా తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ ఇస్తామన్నారు. గతంలో ఈ పథకం ఉద్యోగులకు మాత్రమే ఉండేదని ప్రస్తుతం ఏ పట్టభద్రుడికైనా వర్తిస్తుందని తెలిపారు. స్వీయ ధృవీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆర్‌పిఎల్ఐ గ్రామీణ ప్రాంతీయులకు మాత్రమే వర్తిస్తుందన్నారు. ఈ నెల 13న శుక్రవారం ఫిలాటిలీ డే నిర్వహిస్తామన్నారు. మైస్టాంప్ పథకం కింద స్వీయ చిత్రపటంతో స్టాంప్‌ను తయారు చేయించి అందజేస్తామన్నారు. ఇందుకు రూ.300లు చెల్లిస్తే 60స్టాంప్‌లు అందజేస్తామన్నారు. అలాగే సంస్థల తరపున కవర్‌లు తయారు చేయించి అందిస్తామన్నారు. ఇందుకు సైజ్‌ను బట్టి పైకం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 14న శనివారం బిజినెస్ డెవలప్‌మెంట్ డే, 15న ఆదివారం మైల్స్ డే నిర్వహిస్తామని వివరించారు. 60 సంవత్సరములు పైబడిన వృద్ధులకు సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం ప్రయోజనకరంగా ఉందన్నారు. రూ.లక్ష డిపాజిట్ చేస్తే ప్రతి మూడు నెలలకోమారు రూ.2050 వడ్డీ చెల్లిస్తామన్నారు. సుకన్య సమృద్ధి యోజన అకౌంట్ అప్పుడే పుట్టిన శిశువు నుండి 10 సంవత్సరముల వరకు పాలసీ వర్తిస్తుందన్నారు. శిశువు భవిష్యత్ అవసరాలను తీర్చేలా ఉంటుందన్నారు. మహిళ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికేట్ కేవలం మహిళలకు ప్రత్యేకించబడిందన్నారు. ఇలా పలు వయసుల ఆదాయ వర్గాల వారికి అనుకూలంగాను, ప్రయోజనకరంగాను తపాల శాఖ పథకాలను అందిస్తోందని సుబ్బరాయుడు వివరించారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రహదారి కష్టాలు తీర్చరూ..!

**ప్రజాశక్తి - ఖాజీపేట**

మండల పరిధిలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు ఏపుగా పెరిగిన కంపచెట్ల వల్ల అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కంపచెట్లు ఏపుగా పెరగడంతో తీవ్ర సమస్యగా మారింది. ప్రజలు రాకపోకలు సాగించాలంటే వారు తీవ్ర అవస్థలకు గురికావాల్సి వస్తోంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో పొలాల వద్దకు చేరుకోవాలంటే కష్టతరంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. మైదుకూరు రోడ్డులోని సాయిబాబా ఆలయం వెనుక పొలాలకు వెళ్లే రహదారి కంపచెట్లతో అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో రైతులు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇక్కట్లకు గురి కావాల్సి వస్తుందని, కంప చెట్లు తొలగించి దారి కష్టాలు తీర్చాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. ఇదే మార్గం ద్వారా బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు వసతి గృహానికి వెళతుంటారని, కంపచెట్లు ఏపుగా పెరిగి ఉండడం వల్ల విష సర్పాల బెడద ఎక్కువవుతోందని విద్యార్థులు భయాందోళన వ్యక్తపరిస్తున్నారు. బాలికల వసతి గృహం వెనుకవైపు కంప చెట్లు విపరీతంగా ఏపుగా పెరిగి పరిసరాలు అధ్వానంగా మారాయని విద్యార్థులు, వసతి గృహ సిబ్బంది ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కంపచెట్లు పెరిగి అధ్వానంగా ఉన్న దారి

## నీటి కేటాయింపుల్లో అన్యాయం చేస్తే పోరాటానికి సిద్ధం

**రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు**

**ప్రజాశక్తి - వేంపల్లె**

కృష్ణానది నీటి కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగితే మరో పోరాటానికి సిద్ధమవుతామని అఖిల పక్ష నేతలు హెచ్చరించారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిపిఐ పులివెందుల ఏరియా సహాయ కార్యదర్శి బ్రహ్మం అధ్యక్షతన కృష్ణానది నీటి కేటాయింపులపై అఖిలపక్ష పార్టీ, ప్రజాసంఘాల నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కృష్ణా నీటి వివాదాలపై ఏర్పాటైన ట్రిబ్యునల్స్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నీటిని పునః పంపిణీ పేరుతో ఎపి, తెలంగాణ, రాష్ట్రాలకే పరిమితం చేస్తూ బాధ్యతలను బ్రిజేష్‌కుమార్ ట్రిబనల్‌కు కట్టబెట్టి తద్వారా తెలంగాణలో రాజకీయ లబ్ధి పొందాలని బిజెపి కుట్రలు చేస్తున్నట్లు విమర్శించారు. అడుగడుగునా రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా స్పందించని వైసిపి చేతకానితనానికి నిదర్శనమన్నారు. సిపిఐ పులివెందుల ఏరియా సహాయ కార్యదర్శి బ్రహ్మం, ఏరియా కార్యదర్శి వెంకట రాములు మాట్లాడుతూ ఒకవైపు కేసు విచారణలో ఉండగానే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అడ్డగోలు నిర్ణయాలు చేసి అందలమెక్కాలని చూస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కళ్ల ముందే అన్యాయం జరుగుతుంటే కళ్లప్పగించి చోద్యం చూడడం సిగ్గుచేటని విమర్శించారు. 9న కడప కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు తీర్మానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధ్రువకుమార్‌రెడ్డి, ఉత్తన్న, రామకృష్ణ, నరసింహరెడ్డి, బద్రి, రాఘవయ్య, అమర్నాథ్‌రెడ్డి, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు రహమతుల్లా, గౌస్ బాబా, పీర్ బాషా, మౌలా, తాజ్, సిరాజ్ పాల్గొన్నారు.

ఐక్యతను చాటుతున్న ఆయా పార్టీల నాయకులు

## పల్లవోలులో అస్తవ్యస్తంగా డ్రయినేజీ వ్యవస్థ

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపై డ్రయినేజీ కాలువ లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై నిలుస్తూ ప్రయాణికులు, గ్రామస్తులకు ఇబ్బందికరంగా తయారైంది. ముఖ్యంగా సచివాలయానికి వెళ్లే మార్గం వద్ద చిన్నపాటి వర్షానికి కూడా నీరు వచ్చి నిలుస్తోంది. మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారి ఏర్పాటు చేసిన సమయంలో గ్రామాల వద్ద డ్రయినేజీ కాలువలను ఏర్పాటు చేశారు. విశ్వనాధపురం, చాపాడు, పల్లవోలు గ్రామాల్లో కూడా డ్రయినేజీ కాలువలను ఏర్పాటు చేశారు. వీటిని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో వర్షపు నీరు గ్రామంలో చేరుతోంది. చాపాడులో కూడా మురుగు కాలువ పూర్తిగా వ్యర్థ పదార్థాలతో నిండి, నిరుపయోగంగా మారింది. పల్లవోలు గ్రామంలో గతంలో పంచాయతీ నిధులతో మురుగు కాలువలో పూడికతీత పనులను చేపట్టారు. కాలువ గ్రామం చివరి వరకు ఏర్పాటు చేయకపోవడంతో కాలువలో చేరిన నీరు రోడ్డుపై నిలుస్తోంది. సచివాలయం, ఆర్‌బికె, విలేజ్ హెల్త్ క్లినిక్, అంగన్వాడీలకు వెళ్లే మార్గాన వర్షపు నీరు చేరుతోంది. అధికారులు, ప్రజలకు కూడా సమస్య ఏర్పడుతోంది. అంతేకాకుండా ఈ మార్గాన అంకాలమ్మ దేవాలయం ఉండడంతో నిత్యం భక్తులు వెళుతుంటారు. వర్షపు నీరు నిలిచి మురికి గుంత ఏర్పడుతూ దోమలు వృద్ధి చెందుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సచివాలయానికి వెళ్లేదారిలో నిలిచిన వర్షపు నీరు(ఫైల్ ఫొటో)

## విభిన్నప్రతిభావంతులకు దుస్తులు వితరణ

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

డాక్టర్ ఇసి గంగిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు డాక్టర్ ఇసి దినేష్‌రెడ్డి విభిన్న ప్రతిభావంతులకు ఆదివారం దుస్తులు వితరణ చేశారు. స్థానిక ముద్దనూరు రోడ్డులోని విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇసి విశ్వనాథరెడ్డి డాక్టర్ గంగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ దినేష్‌రెడ్డి సమకూర్చిన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతిఏటా తన తండ్రి వర్ధంతి సందర్భంగా నిరుపేద విభిన్నప్రతిభావంతులకు చేయూతనందిస్తున్న డాక్టర్ దినేష్‌రెడ్డిని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి అభినందిస్తూ, ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వెంకటసుబ్బయ్య, లింగాల మండల విభిన్నప్రతిభావంతుల సమాఖ్య అధ్యక్షులు నాగేశ్వరరెడ్డి, కార్యదర్శి కామసముద్రం చంద్రఓబులరెడ్డి, లింగమయ్య, ప్రసాద్, డేవిడ్ పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న విశ్వనాథ్‌రెడ్డి

## రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెడుతున్న జగన్

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తును కేంద్రం వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాకట్టు పెడుతున్నారని టిడిపి జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పాత బస్టాండ్‌లో ఆయన రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. అనం తరం జిల్లా టిడిపి అధ్యక్షులు లింగారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లా డుతూ వైఎస్ వివేకా నందరెడ్డి హత్య కేసు నుంచి బయటపడేందుకు రాష్ట్రాన్నే అంధకారంలోకి నెట్టేస్తున్నారన్నారు. కేంద్రం కృష్ణా జలాల మీద గెజిట్ విడుదల చేస్తే జగన్మోహన్‌రెడ్డి నోరెత్తడం లేదన్నారు. మరోవైపు రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఊసే లేదన్నారు. విభజన హామీలను తుంగలోకి తొక్కి, వివేకానంద కేసు నుంచి బయట పడేందుకు శతవిధాలా ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. లింగారెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఎన్నికల నగారా మోగుతున్న సమయం ఆసన్నం కావడంతో బిజెపి నీటి పంపకాన్ని ముందుకు తీసుకొచ్చిందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ మధ్య కృష్ణా జలాల పంపకం జరిగిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, శివనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, పొన్నతోట బ్రదర్స్ శ్రీను, మల్లి ఉన్నారు. శిబిరంలో కూర్చున్న వారిలో శివశంకరరావు, రాంప్రసాద్, పొన్న చంద్ర, మునిరాజా, మురళీ, దస్తగిరి, శ్రీనివాసులున్నారు. సాయంత్రం దీక్షను విరమింపజేశారు.

మాట్లాడుతున్న భూపేష్ సుబ్బరామిరెడ్డి

**పులివెందుల రూరల్ :** రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని, టిడిపి అధికారంలోకి రావడం చారిత్రక అవసరమని మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పార్టీ కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి వారికి కండువా కప్పి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు బ్రాహ్మణపల్లి వెంకట రామిరెడ్డి, పట్టణ అధ్యక్షులు అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, సీనియర్ నాయకులు సిద్ధారెడ్డి, రఘునాథ్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, అమర్, నాయకులు పాల్గొన్నారు .

**ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ప్రొద్దుటూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ మహిళా అధ్యక్షురాలు భోగాల లక్ష్మీనారాయణమ్మ, 40 వార్డ్ పల్లా లక్ష్మీదేవి, 28 వార్డ్ లక్ష్మీదేవి, మాజీ కౌన్సిలర్ పాణ్యం సుబ్బరాయుడు దీక్షలో కూర్చున్నారు. వీరికి మద్దతుగా ప్రొద్దుటూరు రూలర్ మండల కన్వీనర్ బోడెల బాబుల్ రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, దొరసానిపల్లె ఇంజిటీ నాగయ్య, ప్రొద్దుటూరు మండలం ఉపాధ్యక్షుడు షరీఫ్, కవి, ప్రొద్దుటూరు పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు తమ్మిశెట్టి శ్రీనివాసులు, 38 వార్డ్ ఇట్టే సునీల్‌కుమార్, గోపవరం గౌస్ మొహిద్దిన్,పెన్నానగర్ మజీద్, మెరువా మూర్తి, 9 వార్డ్ కరీముల్లా పాల్గొన్నారు.

**కుందూ నదిలో అర్ధ నగ్నంగా జల దీక్ష :** టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అరెస్ట్‌కు నిరసన మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కామనూరు కుందూ నదిలో అర్ధ నగ్నంగా జల దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని పల్లవోలు గ్రామ సమీపంలో ఉన్న కాశినాయన వృద్ధాశ్రమంలో ఆదివారం ఆరోగ్య విస్తరణ అధికారి మాచనూరు రాఘవయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ తమ రెండవ కుమారుడు మాచనూరు శివతేజ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశామన్నారు. అనంతరం రాఘవయ్య వృద్ధులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాశినాయన ఆశ్రమ నిర్వాకులు వెంకటయ్య పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న రాఘవయ్య దంపతులు

## మానసిక ఒత్తిడిలో ఆశా వర్కర్లు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

పని వత్తిడి పెరిగిపోయి ఆశా వర్కర్లు మానసిక వత్తిడికి గురవతున్నారని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయ కుమార్ పేర్కొ న్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆశా వర్కర్లపై పని భారం ఎక్కువగా ఉందన్నారు. ఉదయం ఆరు గంటల నుండి రాత్రి ఎనిమిది గంటల వరకు నిమగ్నమై ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా రోజుకు 16గంటలు పని చేస్తు న్నారన్నారు. ఆదివారాలు సెలవులుండవ్.. బంధువులు ఎవరైనా చనిపోతే సెల వులిచ్చే విషయంలో ఎఎన్ఎంలు, డాక్టర్లు సహకరించడంలేదన్నారు. ఈ వత్తిళ్ల తో చాలా మంది ఆశా వర్కర్లకు షుగర్, బిపి వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశా రు. ఆశా వర్కర్ కృపమ్మ చనిపోయేందుకు సురక్ష వత్తిడే కారణమన్నారు. ఆశా వర్కర్లకు అడిగిన వెంటనే సెలవులు మంజూరు చేసి, పని వత్తిడి తగ్గించాలని కోరారు. వేధింపులు తగవన్నారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు రూ.26వేలు వేతనం ఇవ్వాలన్నారు. సమావేశంలో సిఐటియు నాయకులు శేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

## తపాలాశాఖ ఆధ్వర్యంలో పరీక్షలు

**జమ్మలమడుగు రూరల్** విద్యార్థులకు దీన దయాల్ స్పర్శ యోజన ఉపకారవేతనం ద్వారా తపాలాశాఖ వరం కల్పిస్తుందని తపాలాశాఖ సూపరిడెంట్ జి.కిరణ్ అన్నారు. ఆదివారం స్థానిక సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాలలో తపాలా శాఖ విద్యార్థులకు పరీక్షను నిర్వహించింది. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులకు దీన దయాళ్ స్పర్శ యోజన ఉపకారవేతన పరీక్షపై ఆయా పాఠశాలలో ముం దుగానే అవగాహన కల్పించామన్నారు. విద్యార్థులకు ఫిలాటేలి ప్రాముఖ్యతను భవిష్యత్ తరాలకు తెలిపే ఉద్దేశంతో ఈ పరీక్ష ఉందన్నారు. డివిజనల్ అసి స్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ టి.దుర్గాప్రసాద్ ఇన్విజిలేటర్‌కు పరీక్ష నిర్వ హణపై జాగ్రత్తలు, విద్యార్థులకు దీన దయాల్ స్పర్శ యోజన పరీక్ష సూచ నలు తెలిపారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుశీల్ పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు. పరీక్షకు 94 మంది విద్యార్థులకుగానూ 85 మంది హాజ రయ్యారు.